బంగారం ఎత్తుకెళ్లిన వ్యక్తి అరెస్ట్







నస్రుల్లాబాద్‌లో దొంగల బీభత్సం

AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in



### జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ నాగమోహన్‌కు సన్మానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నాగమోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ కృష్ణ మోహన్, కళాశాల సూపరింటెండెంట్ నాగరాజు, ఏడీ రమాదేవి, సిబ్బంది తదితరులు నాగమోహన్‌ను ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలియజేశారు.





## ఏసీబీ నూతన కార్యాలయం ప్రారంభం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో నూతన ఏసీబీ కార్యాలయాన్ని సీపీ సాయిచైతన్య ప్రారంభించారు. సుభాష్‌నగర్‌లోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించిన ఏసీబీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఏసీబీ వెస్ట్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ కమలాకర్ రెడ్డి, నిజామాబాద్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్లు వేణుకుమార్, నగేష్, ఏసీబీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఎక్కడ అవినీతి జరుగుతుందని తెలిసినా తమ నంబర్లు 1064, ఏసీబీ డీఎస్పీ 9154388950, ఇన్‌స్పెక్టర్లు 9154388923, 9154388951లలో సంప్రదించాలని కోరారు



‘పది’ పరీక్షలు

## ముగిసాయెోచ్...

**ఎన్నడూలేని విధంగా పదో తరగతి పరీక్షలు ఈ ఏడాది ఏకంగా సుమారు నెల రోజుల పాటు జరిగాయి. సోమవారం పరీక్షలు ముగియడంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. చివరి పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులు తమ తోటి స్నేహితులతో సందడి చేశారు. మళ్లీ ఎప్పుడు కలుసుకుందామంటూ ముచ్చటించారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్**



**ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే సీఎం, మంత్రులు స్పందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కోసం మంత్రుల కాళ్లు మొక్కాలా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంకు సుమారు 20 సార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదన్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని వాపోయారు. - అక్షరటుడే, కామారెడ్డి**

# సర్కార్‌పై పోచారం గుస్సా



- మంత్రులు, సీఎంపై సీనియర్ నేత అసహనం
- నిధులు ఇవ్వడం లేదని ఆగ్రహం
- ఫోన్లకు స్పందించడం లేదని ఆవేదన
- మంత్రుల కాళ్లు మొక్కాలా అంటూ ఆగ్రహం
- రాజకీయ దుమారం రేపుతున్న వ్యాఖ్యలు

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన గతంలో టీడీపీలో, బీఆర్ఎస్‌లో కీలకంగా పని చేశారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ శాఖ మంత్రిగా, స్పీకర్‌గా పని చేశారు. ఆ సమయంలో బాన్సువాడ నియోజకవర్గానికి భారీగా నిధులు తెచ్చుకొని అభివృద్ధి పనులు చేపట్టారు. బీఆర్ఎస్ ఓటమి తర్వాత పోచారం కాంగ్రెస్ గూటికి చేరారు. ప్రభుత్వ సలహాదారు పదవి కూడా తీసుకున్నారు. అయితే అలాంటి సీనియర్ నేత తాజాగా ప్రభుత్వంపై విమర్శలు చేయడం గమనార్హం. ఆయన వ్యాఖ్యలు కాంగ్రెస్ సర్కారును ఇరకాటంలో పెట్టాయి.

**ఇదేం ప్రభుత్వం**

సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులకు సంబంధించిన నిధుల విడుదల కోసం సంబంధించిన శాఖ మంత్రులకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన కరువైందని పోచారం ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇదేం ప్రభుత్వం.. కనీసం అధికారులు కూడా ఫోన్ లిఫ్ట్ చేయరా.. గత 20 ఏళ్లుగా మంత్రిగా ఉన్నాను. అర్ధరాత్రి ఎవరు ఫోన్ చేసినా నేను స్పందించిన. ఇదేం ప్రభుత్వం. మంత్రుల కాళ్ళు మొక్కాలా..' అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

### ఏళ్లుగా సాగుతున్న పనులు

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే ఆ ప్రాంత వాసులకు మేలు కలుగుతుంది. ఈ పనులను పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదివారం అర్ధరాత్రి పరిశీలించారు. పనుల ఆలస్యంపై ఆరా తీయగా నిధుల కొరత అని తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల విడుదలపై సీఎంకు 20 సార్లు ఫోన్ చేశానని, మంత్రులైతే అసలే ఫోన్ ఎత్తడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

### బిల్లుల కోసమేనా..

దాదాపు 40 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంచి పేరుంది. ఎంతటి ఇబ్బంది ఉన్నా ఒక్కసారి కూడా ఆయన మాట తూలిన దాఖలాలు లేవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయితే పోచారం చేసిన వ్యాఖ్యలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బిల్లుల పెండింగ్ విషయమై మాత్రమే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

### కొన్ని ఇబ్బందులు ఉన్నాయి..: పీసీసీ చీఫ్

పోచారం వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ప్రభుత్వంలో కొన్ని ఇబ్బందులు ఉన్న మాట నిజమేనని, పోచారం శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నేత అని ఆయనకు తెలియనివి కావన్నారు. గత టీడీపీ, కాంగ్రెస్ హయాంలో రూ.68 వేల కోట్ల అప్పు ఉంటే గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ రూ.8 లక్షల కోట్లు అప్పు చేసి పోయిందన్నారు. తమ ప్రభుత్వం ప్రతి నెల రూ.6 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్లు వడ్డీ చెల్లిస్తుందన్నారు. నిధుల కొరత ఉందని చెప్పారు. అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని పేర్కొన్నారు. దీంతో ఇబ్బందులు అవుతుండవచ్చని తెలిపారు. నిధుల విషయంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి అర్థం చేసుకుంటారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



## ప్రజావాణికి 124 ఫిర్యాదులు

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమానికి 124 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో పాటు సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**అక్షరటుడే లింగంపేట:** మండలంలోని పోల్కంపేట గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ దివిటి రమేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోల్కంపేటలోని 100 ఏళ్ల చరిత్ర కలిగిన చౌదరి చెరువు కట్ట తెగిపోవడంతో దానికి మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తండాకు రోడ్డు, తండాలో అంగన్‌వాడీ భవనం అవసరమున్నాయన్నారు. ప్రయాణ ప్రాంగణం వద్ద వాటర్ ట్యాంక్ కూలిపోయే స్థితిలో ఉందని దానికి తొలగించి నూతన ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.




## పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కాంగ్రెస్ భరోసా: షబ్బీర్‌అలీ

**అక్షరటుడే, ఇందూరు:** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ భరోసాగా ఉంటుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో 591 మంది లబ్ధిదారురులకు రూ. 5.92 కోట్ల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. చెక్కుల పంపిణీ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్రం అప్పుల కష్టాల్లో ఉన్నప్పటికీ, పేద ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 404 మంది మైనారిటీలకు షాదీ ముబారక్ కింద, 187మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి కింద చెక్కులు అందజేశారు. అనంతరం పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కీలకమైన హామీలను నెరవేర్చిందని గుర్తు చేశారు. కేవలం మాటలు చెప్పడం కాదు, చేతల్లో చూపిస్తున్న ప్రభుత్వం తమదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వీటికి తోడు ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉద్యోగాల కల్పన, సన్నబియ్యం పథకాలతో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ, గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు, బొబ్బిలి రామకృష్ణ, మేయర్ ఉమారాణి, నుడా ఛైర్మన్ కేశ వేణు, స్థానిక కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. నగరంలోని గెస్ట్‌హౌస్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి పేదవాడిని ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 6వ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాస్త్రి నగర్‌లో నిర్వహించిన గ్రామ సభకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది మృతి చెందగా.. 2025లో జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వల్ల 302 మంది తమ ప్రాణాలను కోల్పోయారన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఇన్‌ఛార్జి ఏసీపీ రాజా వెంకట




రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, నిజామాబాద్ సౌత్ రూరల్ సురేష్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వినోద్, ఆరో టౌన్ ఎస్సై వెంకట్ రావ్, జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి కిరణ్ కుమార్, ఎస్సై డి.శ్రీకాంత్, సర్పంచ్ నరాల జ్యోతి, డివిజనల్ పంచాయతీరాజ్ ఆఫీసర్ శ్రీనివాస్, వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమష్టిగా కృషి చేద్దాం : కలెక్టర్ ఇలా త్రిపాఠి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం ఆర్మూర్ మండలం పిప్రిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా వర్కర్లు, ఇతర గ్రామ పెద్దలతో కూడిన తొమ్మిది మందితో రోడ్ సేఫ్టీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మన దేశంలో, రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదాలకు నియంత్రించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ స్థాయి అత్యున్నత అధికారులు ప్రజల్లో అవగాహనను పెంపొందిస్తూ.. వారిని భాగస్వాములు చేసేందుకు అరైవ్ - అలైవ్ పేరిట కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమాల ఔన్నత్యాన్ని గుర్తిస్తూ ప్రతిఒక్కరూ ఇందులో భాగస్వాములై, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తమవంతు




కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర రావు, ఎంపీడీవో శివాజీ, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీవో శ్రీనివాస్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎంవీఐ రాహుల్ కుమార్, జీపీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

www.aksharatoday.in
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

## ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతిఒక్కరి బాధ్యత: సీఐ జాన్‌రెడ్డి



**అక్షరటుడే, ఆర్మూర్ :** ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతిఒక్కరి బాధ్యత అని సీఐ జాన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఆంధ్ర నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బైక్‌పై ప్రయాణించేవాళ్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని.. కార్లలో వెళ్లేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలన్నారు. అధిక వేగం నివారణ ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు సభ్యులను ఎంపిక చేశారు. అనంతరం గ్రామ ప్రజలందరితో రోడ్డు భద్రత ప్రమాణం చేయించారు. అలాగే సురక్షిత డ్రైవింగ్‌ను ప్రోత్సహించేందుకు 20 హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నందిపేట సబ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ రాజ్, సర్పంచ్ వట్టిగుంట సుష్మ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అధికారులు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.




## దాడి చేసి బంగారం ఎత్తుకెళ్లిన వ్యక్తి అరెస్ట్

**అక్షరటుడే, భిక్కనూరు:** మహిళపై దాడి చేసి ఆమె మెడలో నుంచి బంగారం ఎత్తుకెళ్లిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్యరెడ్డి వివరాలు వెల్లడించారు. భిక్కనూరు గ్రామంలోని గాజులపేట గల్లీలో ఒంటరిగా నివాసముంటున్న ఉప్పరి లచ్చవ్వ ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు ఆమెపై కర్రతో దాడి చేశాడు. అనంతరం ఆమె మెడలో నుంచి పుస్తెల తాడు, గుండ్లు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో భిక్కనూరు చర్చి గేట్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 40 గ్రాముల బంగారు పుస్తెల తాడు, 10 గ్రాముల గుండ్లు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.




# జాకోరా, చందూర్ 'లిఫ్ట్'

నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని నాన్ కమాండ్ ఏరియాకు జీవనాడిగా నిలిచే జాకోర–చందూర్ ఎత్తిపోతల పథకం పనులు చివరి దశకు చేరుకోవడం రైతులకు ఆశాకిరణంగా మారింది. రూ.106 కోట్ల వ్యయంతో బాన్సువాడ సెగ్మెంట్‌లోని వర్ని మండల పరిధిలో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 10 వేల ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందనుంది. నిజామాబాద్ జిల్లాలో సాగునీటి వనరుల విస్తరణలో కీలకంగా భావిస్తున్న జకోరా–చందూర్ లిఫ్ట్ తుదిదశకు చేరుకోవడం, ముఖ్యంగా బాన్సువాడ నియోజకవర్గ రైతుల్లో కొత్త ఆశలను నింపుతోంది. – అక్షరటుడే, బాన్సువాడ

■ ప్రారంభానికి సిద్ధమైన జాకోరా, చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ■ హర్షం వ్యక్తం చేస్తున్న బాన్సువాడ రైతులు

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి జకోరా-చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఎంతో కృషి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పథకాన్ని మంజూరు చేయించారు. ప్రస్తుతం పథకం చివరి దశకు చేరుకుంది. ఎమ్మెల్యే పోచారం పథకం పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులపై ఒత్తిడి తేవడంతో పనులు పూర్తయ్యాయి. నాన్ కమాండ్ ఏరియా రైతులు ఎంతో కాలం ఎదురుచూస్తున్న ఎత్తిపోతల పథకం ప్రారంభానికి సిద్ధం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే ఈ ప్రాజెక్టును ప్రారంభించి సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వానికి ఉంది. రూ.106 కోట్ల వ్యయంతో రూపొందించిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రధానంగా వర్ని, చందూర్, మోస్రా మండలాల్లోని 10 వేల ఎకరాల వ్యవసాయ భూములకు నీరు అందించనుంది. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం, వర్షాభావ పరిస్థితులు తరచూ రావడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఇది శాశ్వత పరిష్కారంగా నిలవనుంది.

### బాన్సువాడ రైతులకు ఊరట..

బాన్సువాడ నియోజకవర్గం ప్రధానంగా వరి, మక్క వంటి పంటలపై ఆధారపడిన ప్రాంతం. నీటి కొరత కారణంగా పంటల దిగుబడులు తగ్గిపోవడం, పెట్టుబడులు పెరగడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాది పొడవునా పంటలకు సాగు నీరు అందుతుంది. ఇటీవల ఎమ్మెల్యే పోచారం శ్రీనివార్ రెడ్డి పంపు మోటార్ల ట్రయల్ రన్ ప్రారంభించారు.

### నెరవేరిన రైతుల కల



జాకొర-చందూర్ ఎత్తిపోతల పూర్తవడం బాన్సువాడ ప్రాంత రైతుల కల నెరవేరినట్లే. ఎన్నో ఏళ్లుగా నీటి కోసం ఎదురు చూస్తున్న నాన్ కమాండ్ ఏరియా రైతులకు శాశ్వత పరిష్కారం అవుతుంది. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. ప్రాజెక్ట్ ద్వారా వేల ఎకరాలకు సాగునీరందించి పంటల దిగుబడులు పెంచడమే లక్ష్యం. ఖరీఫ్ సీజన్‌కు ముందే నీటిని అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే

## అనాథలకు పండ్ల పంపిణీ

నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాస్త్రినగర్‌లో నిర్మల్ భవన్ వృద్ధాశ్రమాన్ని సీపీ సాయిచైతన్య సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. – అక్షరటుడే, నిజామాబాద్ క్రైం




## బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం ఫతేపూర్ అల్లపు రాజన్న ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ సర్జరీ కోసం నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. కాగా.. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.3లక్షల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ కార్యదర్శి బత్తుల ప్రవీణ్ కుమార్, గ్రామ సీనియర్ నాయకులు రాజేశ్వర్ రెడ్డి, మట్ట సంజీవ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల శివనామస్మరణలతో మార్మోగిన సిద్ధరామేశ్వరాలయం



**అక్షరటుడే, భిక్కనూరు:** మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సిద్ధ రామేశ్వర స్వామి స్వయంభు లింగ మహాక్షేత్రంలో చైత్రమాసం కృష్ణ ఏకాదశి సోమవారం సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు సత్యనారాయణ స్వామి వ్రతాలు, పుట్టువెంట్రుకలు వంటి కైంకర్యాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి చంద్రమౌళి గుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నదానం నిర్వహించిన చంద్రమౌళి గుప్త కుటుంబ సభ్యులకు స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆలయ అనువంశ అర్చకులు కొడకండ్ల రామగిరి శర్మ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు తాటి పాముల లింబాద్రి, ఉపాధ్యక్షుడు అందె దయాకర్ రెడ్డి, సభ్యులు నీలా అంజయ్య, చీకోటి ప్రభాకర్ గుప్తా, నాగర్తి రమేశ్ రెడ్డి, బాపురెడ్డి, నారాయణ, బాగయ్య పాల్గొన్నారు.

## సహజీవనం చేస్తున్న వ్యక్తిని హత్య చేసిన మహిళ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సహజీవనం చేస్తున్న వ్యక్తిని ఓ మహిళ హత్య చేసింది. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని నాలుగో టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వినాయక్‌నగర్‌లో జక్కలోళ్ల మోహన్(40) అనే వ్యక్తి మేస్త్రి పనిచేసేవాడు. సుమారు ఎనిమిదేళ్లుగా స్థానికంగా ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. అయితే ఇటీవల వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 12న తేదీ ఉదయం సదరు మహిళ మోహన్‌ను చీరతో మెడ చుట్టూ గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. అతడిది ఆదిలాబాద్ జిల్లా అని మాత్రమే తెలిసినందున.. పూర్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే నాలుగో టౌన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. మృతుడు పనిచేసే యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి..: కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మామిడిపల్లిలో గల సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును, అందుబాటులో ఉన్న సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీయగా.. రెండు కేంద్రాలలోనూ పూర్తిస్థాయిలో హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా..? స్ట్రాంగ్ రూం నుంచి ఎన్ని గంటలకు ప్రశ్నాపత్రాలు కేంద్రానికి చేరుకున్నాయనే వివరాలను ఆరాతీశారు. తాగునీటి వసతి, ప్రథమ చికిత్స అందుబాటులో ఉందా లేదా అని గమనించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ సత్యనారాయణ తదితరులున్నారు.



## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

**అక్షరటుడే, కోటగిరి :** వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ కల్లూరి సంధ్య అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం చలివేంద్రాన్ని సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మాండ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా ప్రజల తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నబి, పంచాయతీ కార్యదర్శి యాదవ్, వార్డు మెంబర్లు, అనిల్, సంతోష్ పటేల్, జుమ్మా ఖాన్, శంకర్, శేఖర్ శివ, పంచాయతీ సిబ్బంది నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లిలో మక్కలు, వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, ముప్కాల్:** వేంపల్లి గ్రామంలో పీఏసీఎస్ సొసైటీ, వేల్పూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మక్కలు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు మద్దతు ధరలు అందేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.ముత్యం రెడ్డి, వేంపల్లి సర్పంచ్ మహేష్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చందా రవి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, నల్లూర్ సర్పంచ్ గంగాధర్, కొత్తపల్లి సర్పంచ్ గంగాధర్, సీఈవో అశోక్, గ్రామపాలక వర్గ సభ్యులు మల్లయ్య, సంగెమ్ శేఖర్, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నస్రుల్లాబాద్‌లో దొంగల బీభత్సం.. ఒకేరోజు ఆరిళ్లలో చోరీ..

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ లో దొంగలు బీభత్సం సృష్టించారు. ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామం లో ఆదివారం అర్ధరాత్రి చోరీ ఘటన కలకలం రేపింది. గ్రామంలోని ఆరు ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటనతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వివిధ పనుల నిమిత్తం బయట గ్రామాలకు వెళ్లిన కుటుంబాల ఇళ్లలో అర్ధరాత్రి సమయంలో తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆయా ఇళ్లల్లో నగదు, బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల మెరుపుదాడి..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆర్మూర్‌లో పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు మెరుపు దాడి చేశారు. పేకాడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ వెల్లడించారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెర్కిట్, తిరుమల గార్డెన్స్ ఫంక్షన్‌హాల్ పేకాట ఆడుతున్నట్లుగా పక్కా సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఈ సందర్భంగా పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.1,17,940 స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే ఈ పేకాట ఆడే బృందంలో ప్రముఖ నాయకులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఆర్మూర్ పట్టణానికి చెందిన ఓ కౌన్సిలర్, భైంసా మున్సిపాలిటీకి చెందిన మరో నాయకుడు పట్టుబడ్డట్లుగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ఎల్లారెడ్డి కళాశాలలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం కళాశాలకు సెలవు సందర్భంగా ముందస్తుగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ శంకరయ్య మాట్లాడుతూ అన్ని కులాలను సమానంగా చూస్తూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. కళాశాల టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ శివకుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చదువు ఆయన సాధించిన డాక్టరేట్ పట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగనీక, అరుణ్ కుమార్, గంగారెడ్డి, సిద్దు రాజు, కృష్ణ ప్రసాద్, ఎస్.గోదావరి, శశిధర్, సంతోష్, చంద్ర కాంత్, రాణి, మోహిన్, సంగీత, కీర్తి స్వప్న, దశరథ్, మహమూద్ కళాశాల సూపరింటెండెంట్ వసంత లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.